సాక్షి అనకాపల్లి

శుక్రవారం । 7 । జూన్ । 2024



శాస్త్రోక్తంగా ఆర్జిత సేవలు
సింహగిరిపై శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి వారికి గురువారం ఆర్జిత సేవలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. 8లో



శిల్పారామానికి భారీ ఆదాయం
విశాఖ నగరంలోని శిల్పారామంకు మేనెలలో సందర్శకుల ద్వారా భారీ ఆదాయం సమకూరింది. 8లో

గరిష్ఠం/కనిష్ఠం
35.3/24.0

వాతావరణం
ఉరుములు మెరుపులతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం ఒకటి రెండు చోట్లపడే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా కమిటీలు

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో ఎన్నికల తరువాత భయానక వాతావరణం నెలకొంది. టీడీపీ దాడులతో రాష్ట్రంలో అత్యంత దారుణ పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రభుత్వం ఏర్పాటు కాక ముందే టీడీపీ మూకలు రాష్ట్రవ్యాప్తంగా చెలరేగిపోతున్నాయి. ఎక్కడికక్కడ దాడులు చేస్తున్నాయి. దౌర్జన్యాలకు దిగుతున్నాయి. పార్టీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు దిగుతూ అత్యంత పాశవికంగా ప్రవర్తిస్తున్నాయి. ఈ సమయంలో పార్టీ నాయకులకు, కార్యకర్తలకు తోడుగా నిలిచేందుకు వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం 25 పార్లమెంట్ నియోజకవర్గాలకు కమిటీలను ఏర్పాటు చేసింది. ప్రతీ కార్యకర్తకూ, ప్రతీ అక్కచెల్లెమ్మకూ, ప్రతీ అన్నదమ్ముడికీ, సోషల్ మీడియా సైనికులకు ఈ కమిటీలు తోడుగా నిలుస్తాయని ప్రకటనలో పేర్కొంది.
అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గ కమిటీ కమిటీ సభ్యులుగా బొడ్డేడ ప్రసాద్, బూడి ముత్యాలనాయుడు, కరణం ధర్మశ్రీ, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, యూవీ రమణమూర్తిరాజు, కంబాల జోగులు, పెట్ల ఉమాశంకర్ గణేష్, ఈర్లె అనురాధ, మలసాల భరత్‌కుమార్‌లను నియమించారు. వీరు బాధిత కుటుంబాలను పరామర్శించడమే కాకుండా.. వారికి న్యాయపరంగా, వైద్యపరంగా, ఆర్థికంగా సహాయంగా నిలుస్తారని ప్రకటనలో పేర్కొన్నారు.

అంకితభావంతో చక్కని గుర్తింపు



ట్రైయినీ డీఎస్పీ భవ్యరెడ్డిని మెమెంటోతో సత్కరిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి: పోలీస్‌శాఖలో అంకితభావంతో విధులు నిర్వహించిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ అన్నారు. తమ కార్యాలయంలో ట్రైనింగ్ డీఎస్పీగా విధులు నిర్వహించిన భవ్యరెడ్డిని గురువారం ఆయన జ్ఞాపికతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్లలో భవ్యరెడ్డి కానిస్టేబుల్ నుంచి డీఎస్పీ స్థాయి వరకు విధులు నిర్వహించడంలో శిక్షణ తీసుకున్నట్టు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్ పాల్గొన్నారు.

పూర్తయిన పాలిసెట్ కౌన్సెలింగ్



పాలిసెట్ కౌన్సెలింగ్‌లో విద్యార్థుల ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న సిబ్బంది

తుమ్మపాల: పాలిసెట్ చివరి రోజు కౌన్సెలింగ్ రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం జరిగింది. 1,08,001వ ర్యాంక్ నుంచి ఆఖరి ర్యాంకు వరకు వచ్చిన విద్యార్థుల ధ్రువపత్రాలను పరిశీలించి 132 మందికి ఐసీఆర్ పత్రాలు అందించినట్లు ప్రిన్సిపాల్, కోఆర్డినేటర్ ఐ.వి.ఎస్.ఎస్.శ్రీనివాసరావు చెప్పారు. మొత్తం 92 మంది బాలురు, 40 మంది బాలికలు హాజరయ్యారన్నారు. శుక్రవారం నుంచి 10వ తేదీ వరకు వెబ్ ఆప్షన్స్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. జూన్ 11న వెబ్ ఆప్షన్స్ మార్పులు చేసుకోవచ్చని, appolicet.nic.in ఆన్‌లైన్ పోర్టల్‌లో లాగిన్ అయ్యి వెబ్ ఆప్షన్స్ పెట్టుకోవాలన్నారు. అవగాహన కోసం హెల్ప్‌లైన్ సెంటర్ ఫోన్ నంబర్ 8142802794ను సంప్రదించాలన్నారు.

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

అనకాపల్లి: మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతులలో మిగిలి ఉన్న సీట్లలో (2024–25) ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు స్థానిక గవరపాలెం సంక్షేమ పాఠశాల ప్రిన్సిపాల్ డి.వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రవేశ పరీక్షను ఈనెల 20న రాష్ట్రవ్యాప్తంగా ఎంజేపీ పాఠశాలల్లో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల, సంరక్షకుల సంవత్సర ఆదాయం రూ.లక్ష మించరాదన్నారు. మరిన్ని వివరాలకు https://mjpapbcwrreis.apcffss.inను సంప్రదించాలని ఆయన కోరారు.



బైక్ మెకానిక్ శిక్షణ



రిఫ్రిజిరేటర్ రిపేరు చేయడంలో తర్ఫీదు



మహిళలకు టైలరింగ్‌లో..



మహిళలకు బ్యూటీషియన్ కోర్సు

ఉచిత శిక్షణ.. ఉపాధి కల్పన

శిక్షణ స్వల్పకాలమే... సొంత కాళ్లపై ఎదిగేలా తర్ఫీదు ఇస్తోంది. స్వయం ఉపాధి పొందేలా మార్గం చూపిస్తోంది. చేతిలో పట్టా ఉన్నా కొలువు దొరకని వారికి దర్జాగా బతికేలా భరోసా కల్పిస్తోంది. ఇలా ఎంతోమంది జీవితాల్లో ఉపాధి వెలుగులు నింపుతున్న ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ గ్రామీణ నిరుద్యోగులకు వరంగా మారింది.

- వివిధ కోర్సుల్లో 9,031 మందికి తర్ఫీదు
- ఇంతవరకు 7,590 మందికి స్వయం ఉపాధి
- శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి సౌకర్యం
- గ్రామీణ నిరుద్యోగులకు వరం
- అనకాపల్లిలో ఎస్‌బీఐ ఆర్‌ఎస్ఈటీఐ శిక్షణ

అనకాపల్లి: డిగ్రీలు, పీజీలు చేసినా సరైన స్కిల్ లేక ఉద్యోగం, ఉపాధి దొరక్క దిక్కుతోచని స్థితిలో ఉన్న వారు.. ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో మధ్యలో చదువు ఆపేసిన వారు... నిరుత్సాహం పడాల్సిన పనిలేదు. ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ వివిధ ట్రేడ్‌ల్లో నైపుణ్య శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధి కల్పిస్తోంది. అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారిలో 2009 జూలై 1న గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రారంభించింది. విశాఖ ఉమ్మడి జిల్లాలో గ్రామీణ ప్రాంత యువకుల ఉపాధి కల్పనకు బాటలు వేస్తోంది. సంస్థ ప్రారంభించినప్పటి నుంచి గ్రామీణ ప్రాంత యువకులకు శిక్షణ ఇస్తోంది. శిక్షణ అనంతరం వారు కోరుకున్న బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయిస్తూ స్వయం ఉపాధి కల్పిస్తోంది. ఈ సంస్థకు చైర్మన్‌గా కలెక్టర్ వ్యవహరిస్తారు. 18–45 సంవత్సరాల మధ్య వయస్సుగల గ్రామీణ నిరుద్యోగులను మాత్రమే ఎంపిక చేసుకుని వివిధ ట్రేడుల్లో ఉచితంగా శిక్షణ ఇస్తారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తారు. సంస్థను ప్రారంభించి నాటి నుంచి నేటి వరకూ 9,031 మందికి శిక్షణ ఇచ్చారు. ఆయా వృత్తులలో నైపుణ్యం సాధించిన 7,590 మందికి బ్యాంకుల ద్వారా రుణం మంజూరు చేశారు. ముద్రా పథకం కింద ఒక్కొక్కరికి రూ.లక్ష నుంచి రూ.15 లక్షల వరకూ రుణ సదుపాయం కల్పించారు. 2024–25 సంవత్సరంలో నేటికి ఐదు బ్యాచ్‌ల్లో 136 మంది శిక్షణ పొందగా, నేటికి 24 మందికి ఉపాధి కలిగింది. ఈ ఏడాది మరింత మందికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. శిక్షణ కాలంలో ఒక్క రూపాయి కూడా సంస్థ తీసుకోకుండా ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఎస్‌బీఐ, ఆర్‌ఎస్ఈటీఐ) ద్వారా అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. పోటీ ప్రపంచంలో ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని శిక్షకులు చెబుతున్నారు.



అగరబత్తి తయారీపై శిక్షణ తీసుకుంటున్న మహిళలు

శిక్షణ వివరాలు

1.	ఉమెన్స్ టైలరింగ్	30 రోజులు
2.	బ్యూటీ పార్లర్	30 రోజులు
3.	ఎంబ్రాయిడరీ అండ్ ఫ్యాబ్రిక్ పెయింటింగ్	30 రోజులు
4.	జ్యూట్ బ్యాగ్‌ల తయారీ	13 రోజులు
5.	అగరబత్తి తయారీ	10 రోజులు
6.	కొవ్వొత్తుల తయారీ	10 రోజులు
7.	అప్పడాలు, పచ్చళ్లు, మసాలా పొడర్ల తయారీ	10 రోజులు
8.	పుట్టగొడుగుల పెంపకం	10 రోజులు
9.	పాడిపశువు, వానపాముల పెంపకం	10 రోజులు
10.	సెల్‌ఫోన్ రిపేరింగ్	30 రోజులు
11.	ఫొటోగ్రఫీ అండ్ వీడియోగ్రఫీ	30 రోజులు
12.	టూవీలర్ మెకానిజమ్	30 రోజులు
13.	హౌస్ వైరింగ్	30 రోజులు
14.	ఎల్.ఎం.వి.డ్రైవింగ్	30 రోజులు
15.	ఏసీ, ఫ్రిజ్‌ల సర్వీసింగ్	30 రోజులు
16.	మెన్స్ టైలరింగ్	30 రోజులు
17.	కంప్యూటర్ హార్డ్‌వేర్ అండ్ నెట్‌వర్కింగ్	30 రోజులు

బ్యూటీషియన్ కోర్సు నేర్చుకుంటున్నాను....



ఇంటర్మీడియట్ వరకూ చదువుకున్నాను. కుటుంబంలో ఆర్థిక పరిస్థితులు కారణంగా స్వయం శక్తిపై ఎదగాలని ఆశతో ఉన్నాను. నాకు ఇష్టమైన బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ తీసుకుంటున్నాను. ఉచిత శిక్షణతోపాటు వసతి భోజనం కల్పిస్తారని నా స్నేహితురాలు చెప్పడంతో ఇక్కడ చేరాను. శిక్షణ అనంతరం సంస్థ ద్వారా మా ఇంటికి దగ్గరలో బ్యాంకు రుణం తీసుకుని బ్యూటీ పార్లర్ ఏర్పాటు చేసుకుంటాను.

– ఎ.హారిక, మత్స్యపురం గ్రామం, రావికమతం మండలం, అనకాపల్లి జిల్లా

టైలరింగ్‌లో శిక్షణ పొందాను



హుకుంపేటకు ఎస్‌బీఐ ప్రతినిధులు వచ్చి సమావేశం నిర్వహించారు. నిరుద్యోగ మహిళలకు శిక్షణలో ఉచిత భోజనం, వసతి కల్పిస్తామని చెప్పారు. మా కుటుంబ సభ్యులతో మాట్లాడి టైలరింగ్ శిక్షణకు వెళ్లాతానని చెప్పాను. శిక్షణ ఎంతో బాగా ఇస్తున్నారు. శిక్షణ పొందుతున్న మహిళలకు రెండు జతల యూనిఫాం ఉచితంగా అందజేశారు. వసతి, భోజనం బాగుంది. 30 రోజులు శిక్షణ పూర్తి చేసుకుని మా ఇంట్లోనే టైలరింగ్‌తో స్వయం ఉపాధి పొందాలని అనుకుంటున్నాను.

– ఓ.స్నేహిత, గూడ గ్రామం, హుకుంపేట మండలం, అల్లూరి సీతారామరాజు జిల్లా

ఉపాధికి ఎస్‌బీఐ చేదోడు



నేను ఇంటర్ వరకు చదువుకున్నాను. కొన్నాళ్లపాటు ప్రైవేటు ఉద్యోగం చేశాను. కాని జీతం చాలకపోవడంతో కుటుంబాన్ని పోషించడానికి చాలా కష్టంగా మారింది. పెద్దగా చదువులేకపోవడంతో, చేతిలో సరైన నైపుణ్యం లేక ఏం చేయాలో తెలియక బాధపడేవాడిని. అనకాపల్లి జిల్లా ఎస్‌బీఐ సంస్థలో ఉచితంగా సెల్‌ఫోన్ రిపేరింగ్ కోర్సులో శిక్షణ పొందాను. శిక్షణానంతరం డుంబ్రిగుడలో సెల్ పాయింట్ ఏడాది క్రితం ఏర్పాటు చేసుకుని సొంత ఊరిలో నెలకు రూ.20 వేలు సంపాదించుకుంటూ కుటుంబ సమేతంగా జీవిస్తున్నాను.

– కె.దామోదర్, డుంబ్రిగూడ, అల్లూరి జిల్లా

బైక్ రిపేరు చేసుకుని జీవిస్తున్నా...



నేను పదో తరగతి వరకూ ముంచంగిపుట్టులో చదువుకున్నాను. మా గ్రామంలో టూ వీలర్ మెకానిక్ షాపు లేకపోవడంతో ఇబ్బందులు తెలుసుకుని అనకాపల్లిలో సంవత్సరం క్రితం టూ వీలర్ మెకానిక్ నేర్చుకున్నాను. ఎస్‌బీఐ సంస్థలో శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజనం ఇచ్చారు. ప్రస్తుతం మెకానిక్ దుకాణం పెట్టుకుని అన్ని ఖర్చులు పోయి నెలకు రూ.18 వేలు వస్తోంది. బ్యాంక్ ద్వారా దుకాణానికి రాయితీపై రుణం ఇప్పించారు. ఏడాదిలో పూర్తి రుణం బ్యాంక్‌కు కట్టాను.

– వి.భాస్కరరావు, బాపనపుట్టు గ్రామం, ముంచంగిపుట్టు మండలం, అల్లూరి జిల్లా

గ్రామీణ నిరుద్యోగులకు వరం



గ్రామీణ యువతకు 17 కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నాం. శిక్షణ కాలంలో ఉచిత భోజన వసతి, రెండు జతల యూనిఫాం, శిక్షణ పొందిన నిరుద్యోగులకు టూల్‌కిట్స్ అందజేస్తున్నాం. గ్రామీణ ఉమ్మడి విశాఖ జిల్లాలో వివిధ కోర్సుల్లో శిక్షణ పొందిన వారు చాలామంది నిరుద్యోగులను తీసుకువచ్చి చేర్పిస్తున్నారు. ఎస్‌బీఐ సంస్థ ఆదేశాల మేరకు గ్రామీణ నిరుద్యోగులకు ప్రాధాన్యమిస్తున్నాం. 7వ తరగతి పాస్, 10వ తరగతి పాస్ లేదా ఫెయిలైన వారు ఆధార్, తెల్లరేషన్ కార్డు కలిగి ఉండాలి.

– బి.విజయ్‌కుమార్, సంస్థ డైరెక్టర్, అనకాపల్లి

తస్మాత్ జాగ్రత్త

- అంతర్జాతీయ రైల్వే లెవెల్ క్రాసింగ్ వారోత్సవాలు ప్రారంభం
- జాగ్రత్తగా ఉండకపోతే కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించే యత్నం



అంతర్జాతీయ లెవెల్ క్రాసింగ్ వారోత్సవాల సందర్భంగా ప్రత్యేక అవగాహన ర్యాలీ



డీఆర్‌ఎం కార్యాలయం వద్ద వీధి నాటకం ప్రదర్శిస్తున్న సివిల్ డిఫెన్స్ సభ్యులు

తాటిచెట్లపాలెం (విశాఖ): ప్రజల్లో అవగాహన కల్పించే దిశగా ప్రతి ఏడాది నిర్వహించే అంతర్జాతీయ లెవెల్ క్రాసింగ్ వారోత్సవాలు గురువారం రైల్వే వాల్తేర్ డివిజన్ పరిధిలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇంటర్నేషనల్ యూనియన్ ఆఫ్ రైల్వేస్ సహకారంతో ప్రపంచవ్యాప్తంగా ఈ వారోత్సవాలను ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది 'తస్మాత్ జాగ్రత్త.. ఒక్క క్షణంలో మీ జీవితం తారుమారు కావచ్చు' అనే నినాదంతో ప్రపంచవ్యాప్తంగా ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వాల్తేర్ డివిజన్ సివిల్ ఇంజినీరింగ్ విభాగం, సేఫ్టీ పర్సనల్, సివిల్ డిఫెన్స్ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక ర్యాలీ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈనెల 9వ తేదీ వరకు డివిజన్ పరిధిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. డీఆర్‌ఎం కార్యాలయం వద్ద గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాకారులు వీధి నాటకాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలు లెవెల్ క్రాసింగ్స్ వద్ద భద్రతాపరంగా అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రపంచంలోనే అత్యధిక నెట్‌వర్క్ కలిగిన రైల్వే భారతీయ రైల్వే అని, ట్రాక్‌లను దాటేటపుడు ప్రతీ ఒక్కరూ సురక్షిత విధానాలను పాటించాలని తెలిపారు. ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. సీనియర్ డివిజనల్ సేఫ్టీ ఆఫీసర్ సిద్ధార్థ ప్రధాన్ నేతృత్వంలో లెవెల్ క్రాసింగ్ గేట్స్ వద్ద, జన సమ్మర్ధం ఉన్న చోట్ల, రైల్వే ట్రాక్స్ పరిసర ప్రాంతాల కాలనీలలో ప్రత్యేక అవగాహన డ్రైవ్స్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఏడీఆర్‌ఎం (ఇన్‌ఫ్రా) సుధీర్ కుమార్ గుప్తా, డివిజనల్ పి.వే శిక్షణా సంస్థ ప్రిన్సిపల్ ఎం.సత్యనారాయణ, సివిల్ డిఫెన్స్ ఇన్‌స్పెక్టర్ కె.వై.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమృత్ భారత్ రైళ్లకు అపూర్వ స్పందన

- పూర్తి ఆక్యుపెన్సీతో నడుస్తున్న రైళ్లు
- ఏడాదిలో 18,423 ట్రిప్పులు
- ప్రయాణికుల్లో 26–45 ఏళ్ల వారే ఎక్కువ



వందే భారత్ రైలు(ఫైల్)

తాటిచెట్లపాలెం (విశాఖ): అమృత్ భారత్ పేరిట నడుస్తున్న వందే భారత్ రైళ్లకు ప్రారంభం నుంచి మంచి స్పందన లభిస్తోంది. భారతదేశంలో 2019లో విప్లవాత్మకంగా ప్రవేశపెట్టిన వందే భారత్/ట్రెన్ 18లు అనతి కాలంలోనే ప్రజాదరణ పొంది, పూర్తి ఆక్యుపెన్సీతో నడుస్తున్నాయి. ప్రయాణికులు కూడా అద్భుతమైన అనుభూతిని పొందుతున్నారు. ఈ రైళ్లు పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీలో తయారై, భారతదేశ ఇంజనీరింగ్ ప్రతిభను ప్రపంచానికి చాటిచెప్తున్నాయి.
విశాఖ నుంచి మూడు : విశాఖపట్నం- సికింద్రాబాద్-విశాఖపట్నం, విశాఖపట్నం-భువనేశ్వర్-విశాఖపట్నంల మధ్య మొత్తం మూడు వందే భారత్ రైళ్లు నడుస్తున్నాయి. ఇవి ప్రతీరోజు పూర్తి ఆక్యుపెన్సీతో నడుస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు చెప్తున్నారు. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా తయారైన ఈ రైళ్లలో ప్రయాణాలకు మధ్య తరగతి ప్రయాణికులు సైతం వెనుకాడటం లేదు. దీంతో ఈ రైళ్లకు పూర్తి డిమాండ్ నెలకొంది.

వందేభారత్ రైళ్లలోని సౌకర్యాలు
- ఈ రైళ్లు అధునాతన కోచ్‌లతో, పూర్తి భద్రతతో కూడినవి. ప్రమాదాలలో సైతం తట్టుకునేలా(కవచ్) డిజైన్ చేశారు.
- సాధారణ రైళ్ల కన్నా వీటి వేగం ఎక్కువ. గంటకు 160 కి.మీ.ల వేగంతో ఇవి ప్రయాణించగలవు.
- ప్రయాణికులు కోచ్‌ల మధ్య సంచరించేందుకు పూర్తి రక్షణతో కూడిన ఏర్పాట్లున్నాయి.
- సౌకర్యవంతమైన, రివాల్వింగ్ సీటింగ్
- ప్రతీ సీట్ వద్ద మొబైల్ చార్జింగ్ పాయింట్లు
- హాట్‌కేస్, బాటిల్ కూలర్, డీప్ ఫ్రీజర్, హాట్ వాటర్ బాయిలర్స్‌తో కూడిన మినీ పాంట్రీ

- పాడేరు, అరకు నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ ఓటు బ్యాంక్ పదిలం
- 2014 నుంచి 2024 వరకు ఎన్నికల్లో అత్యధిక మెజారిటీలతో విజయం
- అభిమానాన్ని ఓటు రూపంలో చూపిస్తున్న గిరిజనులు
- కొనసాగుతున్న ప్రభంజనం

జగన్ వైపే గిరిజనం

జిల్లాలో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం కొనసాగుతూనే ఉంది. అరకు, పాడేరు నియోజకవర్గాల ప్రజలు జగన్ వెంటే ఉన్నారని ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ రెండు నియోజకవర్గాల్లో 2014 నుంచి 2024 వరకు మూడు దఫాలుగా జరిగిన ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించారు.



వైఎస్సార్‌సీపీ శ్రేణులతో అరకు ఎంపీగా విజయం సాధించిన తనూజారాణి, అరకు ఎమ్మెల్యేగా గెలుపొందిన రేగం మత్స్యలింగం

అనంతగిరి: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జిల్లాలోని పాడేరు, అరకు అసెంబ్లీలకు జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటు బ్యాంక్ పదిలంగానే ఉంది. ఈ రెండు నియోజకవర్గాల్లో ఊహించని మెజారిటీతో ఇద్దరు అభ్యర్థులు విజయం సాధించడం తెలిసిందే. గిరిజనులంతా ఓటు రూపంలో తమ అభిమానాన్ని ఓటు రూపంలో చూపించారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు పట్టం కట్టారు. జగనన్నవైపే గిరిజనులు ఉన్నారన్న విషయాన్ని ఈ ఫలితాలు స్పష్టం చేశాయి. గత 2014 నుంచి 2024 వరకు జరిగిన ఎన్నికల్లో గిరిజనులు వైఎస్సార్‌సీపీ వెన్నంటే ఉన్నారు.

పాడేరు అసెంబ్లీకి..
పాడేరు అసెంబ్లీకి 2014 నుంచి 2024 వరకూ వరుసగా మూడుసార్లు వైఎస్సార్‌సీపీకే ఓటర్లు పట్టం కట్టారు. 2014 ఎన్నికల్లో 2,13,796 ఓట్లకు 1,27,995 ఓట్లు పోలయ్యాయి. అప్పటి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గిడ్డి ఈశ్వరికి 52,384 ఓట్లు పోలయ్యాయి. సమీప ప్రత్యర్థి గొడ్డేటి దేముడుపై 24,141 ఓట్ల మెజారిటీతో ఆమె గెలుపొందారు.
- 2019 ఎన్నికల్లో 2,27,013 ఓట్లకు 1,40,319 ఓట్లు పోలయ్యాయి. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కొట్టగుళ్లి భాగ్యలక్ష్మికి 68,374 ఓట్లు వచ్చాయి. టీడీపీ అభ్యర్థి గిడ్డి ఈశ్వరికి 27,144 ఓట్లు రాగా ఈ ఎన్నికల్లో భాగ్యలక్ష్మి సుమారు 41 వేల మెజారిటీతో గెలుపొందారు.
- ప్రస్తుతం జరిగిన ఎన్నికల విషయానికొస్తే మొత్తం ఓట్లు 2,48,387 కాగా 1,58,747 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజుకు 67,333, టీడీపీ అభ్యర్థి గిడ్డి ఈశ్వరికి 47,468 ఓట్లు లభించాయి. విశ్వేశ్వరరాజు 19,865 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. 2019, 2024 ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే వైఎస్సార్‌సీపీ ఓటు బ్యాంక్ దాదాపుగా పదిలంగానే ఉన్నట్టు స్పష్టమవుతోంది.

అరకు అసెంబ్లీకి..
అరకు అసెంబ్లీలో కూడా వైఎస్సార్‌సీపీ ఓటు బ్యాంక్ నిలకడగానే ఉందని గత మూడు ఎన్నికల ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి.
- 2014 ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వచ్చినప్పటికీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కిడారి సర్వేశ్వరరావు బంపర్ మెజారిటీతో గెలుపొందారు. టీడీపీ నుంచి పోటీ చేసిన సీవేరి సోమకు 29,647 ఓట్లు రాగా, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కిడారి సర్వేశ్వరరావుకు 63,700 ఓట్లు వచ్చాయి. దీంతో ప్రత్యర్థి సోమపై 34,053 ఓట్ల భారీ మెజారిటీతో సర్వేశ్వరరావు గెలుపొందారు.
- 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అదేపార్టీకి చెందిన అసెంబ్లీ అభ్యర్థి చెట్టి పాల్గుణ అత్యధిక మెజారిటీతో విజయం సాధించారు. స్వతంత్ర అభ్యర్థి సియ్యారి దొన్నుదొరకు 27,660 ఓట్లు వచ్చాయి. వైఎస్సార్‌సీపీ నుంచి పోటీచేసిన చెట్టి పాల్గుణకు 53,101 ఓట్లు వచ్చాయి. దీంతో ప్రత్యర్థులపై 25,441 ఓట్ల మెజారిటీతో ఆయన గెలుపొందారు.
- ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో కూడా వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేసిన రేగం మత్స్యలింగం అత్యధిక మెజారిటీతో విజయం సాధించారు. బీజేపీ అభ్యర్థి పాంగి రాజారావుకు 33,781 ఓట్లు రాగా, రేగం మత్స్యలింగానికి 65,658 ఓట్లు వచ్చాయి. ప్రత్యర్థిపై 31,877 ఓట్ల మెజార్టీతో మత్స్యలింగం విజయం సాధించారు.

ఊపిరి ఉన్నంత వరకూ ప్రజలతోనే ఉంటాను

- మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

చోడవరం : తన ఊపిరి ఉన్నంత వరకూ ప్రజా సేవలోనే ఉంటానని మాజీ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. ఎన్నికల ఫలితాలు అనంతరం మొదటిసారిగా చోడవరంలో తన కార్యాలయంలో గురువారం మాట్లాడారు. ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తానన్నారు. నియోజకవర్గం అభివృద్ధి కోసం, ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతుగా ఎప్పుడూ కృషి చేస్తానని ధర్మశ్రీ అన్నారు. పదిహేను యేళ్లుగా చోడవరం నియోజకవర్గం ప్రజలను తనను ఆదరిస్తూనే ఉన్నారన్నారు. రానున్న రోజుల్లో కూడా తనను ఆదరించాలని , ప్రజల పక్షాన నిరంతరం నిలబడి వారి సమస్యల పరిష్కారానికి అవసరమైన పోరాటం చేస్తానన్నారు. ఐదేళ్ల తమ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో రెండేళ్ల పాటు కరోనా పరిస్థితులు వెంటాడినా ప్రజలకు ఎటువంటి కష్టం రాకుండా తమ ప్రభుత్వం అండగా నిలిచి తోడుగా ఉన్నామన్నారు. హంగులు, ఆర్భాటాలకు పోకుండా నిరంతరం ప్రజల్లోనే ఉన్నానని, అనేక ప్రజా సంక్షేమ పథకాలు తమ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ద్వారా అనేక మందికి అందించి మేలు చేశామన్నారు. రైతులకు గ్రామాలకే ఆర్బీకేల ద్వారా అన్ని అందుబాటులోకి తెచ్చామని, ప్రజల చెంతకే సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత పాలనను అందుబాటులోకి తెచ్చి ఎంతో మేలు చేశామన్నారు. తనను నమ్ముకున్న ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పును అంతా గౌరవించాలన్నారు. విజయం సాధించిన ఎమ్మెల్యేలు, ఎంపీలకు ఈ సందర్భంగా ధర్మశ్రీ అభినందనలు తెలిపారు.

విజయవంతంగా ఆపరేషన్ కాంబోడియా

- మరో నలుగురిని తీసుకొచ్చిన పోలీసులు
- ఇందులో నగరానికి చెందిన వారు ఇద్దరు
- ఇప్పటి వరకు భారత్ తిరిగొచ్చిన బాధితులు 68 మంది
- ఇందులో విశాఖకు చెందిన వారు 28 మంది
- ఈ రాకెట్‌లో నగరానికి చెందిన 11 మంది ఏజెంట్ల హస్తం
- నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్


బాధితులతో కలసి ప్రెస్‌మీట్‌లో పాల్గొన్న కమిషనర్ రవిశంకర్

అల్లిపురం (విశాఖ): ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆపరేషన్ కాంబోడియా'విజయవంతంగా కొనసాగుతోందని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ తెలిపారు. ఇప్పటివరకు 21 మంది ఏజెంట్ల ద్వారా కాంబోడియాకు అక్రమంగా తరలించిన 158 మందిలో 68 మందిని భారత్‌కు తీసుకొచ్చామని వెల్లడించారు. వీరిలో నగరానికి చెందిన వారే కాకుండా రాష్ట్రం, ఇతర రాష్ట్రాల వారు ఉన్నట్లు తెలిపారు. కాంబోడియా నుంచి ఈ నెల 4న తీసుకువచ్చిన నలుగురు బాధితులతో కలసి గురువారం ఆయన పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో విలేకరులతో మాట్లాడారు. ఈ కేసు వివరాలు వెల్లడించారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగాల పేరిట కాంబోడియాలోని చైనా సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకున్న మరో నలుగురు బుధవారం ఇండియాకు క్షేమంగా తిరిగివచ్చారు. ఇందులో తాటిచెట్లపాలేనికి చెందిన హేమంత్ కుమార్, కంచరపాలేనికి చెందిన రూపేష్ కుమార్ ఉన్నారు. బాధితుల ఫిర్యాదుతో పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్, జాయింట్ పోలీస్ కమిషనర్ డాక్టర్ కె.ఫకీరప్ప కంబోడియాలోని ఇండియన్ ఎంబసీ ద్వారా అక్కడి ప్రభుత్వంతో మాట్లాడి వీరిని విశాఖపట్నం తీసుకొచ్చారు. ఇప్పటివరకు మొత్తం 21 మంది ఏజెంట్ల ద్వారా 158 యువకులను కంబోడియాకు అక్రమంగా తరలించగా.. వీరిలో 68 మందిని తిరిగి ఇండియా తీసుకొచ్చారు. ఇందులో 28 మంది విశాఖ వాసులు ఉన్నారు. మిగిలిన 90 మంది రావాల్సి ఉంది. ఈ వ్యవహారంపై ఇప్పటివరకు సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌లో మూడు, గాజువాక పోలీస్‌స్టేషన్‌లో ఓ కేసు నమోదైంది. 21 మంది ఏజెంట్లలో నగరానికి చెందిన 11 మందిని సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీపీ తెలిపారు. కాంబోడియా నుంచి సైబర్ నేరాలు చేయడానికి మనుషులను అక్రమంగా తరలిస్తున్న ఏజెంట్లను పట్టుకోడానికి ఇండియన్ ఎంబసీ ద్వారా లుక్ అవుట్ సర్క్యులర్ జారీ చేయడం జరిగిందన్నారు. ఈ ఆపరేషన్ కోసం 20 రోజుల సమయం పట్టిందని, మరో 20 మంది ముఠా సభ్యులు పరారీలో ఉన్నట్లు సీపీ తెలిపారు. కంబోడియాలో పనిచేస్తున్న సైబర్ ముఠా భారత్‌కు చెందిన సిమ్‌లను వినియోగిస్తోందని సీపీ పేర్కొన్నారు.

నేరం గుర్తించారిలా..!

ఆధునిక సాంకేతికతను ఉపయోగించి నేరస్తులను పట్టుకోవడంలో ముందుండే విశాఖపట్నం పోలీసులు మానవ అక్రమ రవాణా జరుగుతున్నట్లు గుర్తించారు. ఇటీవల ఏర్పాటు చేసిన ఆధునిక సైబర్ క్రైం ఇన్వెస్టిగేషన్ ల్యాబ్‌లోని ఫండ్ ట్రెయిల్ సాఫ్ట్‌వేర్ ద్వారా డబ్బుల లావాదేవీలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి.. ఈ డబ్బులు ఎక్కడికి వెళ్తున్నాయో ఆరా తీశారు. ఈ డబ్బులు క్రిప్టో కరెన్సీలోకి మారి.. తద్వారా చైనా దేశానికి తరలి వెళ్తున్నాయని గుర్తించారు. ఈ నేరాలకు ఉపయోగిస్తున్న సోషల్ మీడియా ఖాతాలు, ఇతర స్కైప్ ఐడీల ఐపీలు కంబోడియా, మయన్మార్ బోర్డర్‌కు చెందిన ప్రాంతాలుగా నిర్ధారించారు. ఇదే కాకుండా ఫెడెక్స్, టాస్క్ గేమ్, స్టాక్ ఇన్వెస్ట్‌మెంట్ నేరాలకు సంబంధించి ఐపీలన్నీ కూడా కంబోడియా దేశానికి చెందినవిగా గుర్తించారు. అక్కడి నుంచే సైబర్ స్కామ్‌లు చేస్తూ.. అమాయకులకు చెందిన డబ్బులను కొల్లగొడుతున్నారని ఇన్వెస్టిగేషన్‌లో తేల్చారు. సైబర్ క్రైం చేయడానికి ఇంటర్నేషనల్ హ్యూమన్ ట్రాఫికింగ్ సిండికేట్ ద్వారా మనుషుల అక్రమ రవాణా చేస్తున్నట్లు మొదటిసారిగా నగర పోలీసులే కనుగొన్నారు. ఈ రాకెట్ వెనుక ఉన్న దేశంలో వివిధ ప్రాంతాలకు చెందిన 21 మంది ఏజెంట్లు, సైబర్ క్రైం ముఠాలకు సంబంధించిన ఫేక్ సిమ్‌లు, బ్యాంక్ ఖాతాలను కూడా గుర్తించారు. ఇప్పటికే నగరానికి 11 మంది ఏజెంట్లను అరెస్ట్ చేశారు. మిగిలిన వారిని కూడా పట్టుకుంటామని సీపీ వెల్లడించారు. వీరి కోసం ఏడు స్పెషల్ పోలీస్ బృందాలు పనిచేస్తున్నట్లు వివరించారు. ఇటువంటి ఏజెంట్ల చేతిలో ఇంకా ఎవరైనా మోసపోయినట్లయితే.. వెంటనే సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ కె.భవానీప్రసాద్(94906 17917), కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్ 0891-2565454, వాట్సాప్ నంబర్ 949333 6633కు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. సైబర్ నేరగాళ్ల చేతిలో ఎవరైనా డబ్బులు పోగొట్టుకున్నట్లయితే 1930కు ఫిర్యాదు చేయాలన్నారు.

కమిషనర్‌కు భయపడుతున్నారు

ఇండియాకు తిరిగొచ్చిన బాధితులు మాట్లాడుతూ భారత్‌ను ఆర్థికంగా దెబ్బతీయడానికి చైనా స్కామర్లు కాంబోడియా నుంచి ఈ రకమైన స్కామ్‌లు చేస్తున్నారని తెలిపారు. భారత్‌కు చెందిన యువతను అక్కడకు తీసుకెళ్లి కంపెనీలకు 4 వేల డాలర్లకు అమ్మేస్తున్నారని, ఉద్యోగం చేయలేక వెళ్లిపోతామంటే ఆ 4 వేల డాలర్లు కడితేనే పాస్‌పోర్టులు ఇస్తామని బెదిరిస్తున్నారని వాపోయారు. ఒక్క పూట మాత్రమే భోజనం పెడుతున్నారని, తాగడానికి నీరు లేకుండా, ఒకటే బాత్రూం, జైల్లు లాంటి గదుల్లో కుక్కుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ లాంటి వారు అక్కడ లక్షల మంది ఉన్నారని తెలిపారు. భారత్‌లో రిటైర్ అయిన డిఫెన్స్ ఉద్యోగులే లక్ష్యంగా ఫేస్‌బుక్ ఐడీల ద్వారా గుర్తించి వారితో ఇండియన్ సిమ్‌లతో మాట్లాడించడం, వారిని లోబరుచుకోవడం, వారి రిటైర్‌మెంట్ డబ్బులను కాంబోడియన్స్ ఖాతాల్లో ట్రాన్స్‌ఫర్ చేయడమే ఇక్కడి నుంచి వెళ్లిన యువతుల పని అని చెప్పారు. అలా చేయకపోతే మరిన్ని గంటలు పనిచేయించేయిస్తున్నారని తెనాలికి చెందిన ఓ మహిళ తెలిపారు. విశాఖ పోలీస్ కమిషనర్ ఫొటోను చూపించి ఎయిర్‌పోర్టుకు రమ్మన్నారని చెబితే కంపెనీ ప్రతినిధులు పాస్‌పోర్టు ఇచ్చారని.. కమిషనర్‌కు వారు భయపడుతున్నారని బాధితులు వివరించారు. సమావేశంలో జాయింట్ పోలీస్ కమిషనర్ డాక్టర్ కె.ఫకీరప్ప, సైబర్ క్రైం సీఐ భవానీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రిలో విద్యుదుత్పత్తి పునరుద్ధరణ

పరవాడ : సింహాద్రి ఎన్టీపీసీలో నాలుగో యూనిట్‌లో బుధవారం తెల్లవారు జామున సాంకేతిక కారణాలతో నిలిచిపోయిన విద్యుత్ ఉత్పత్తిని మరమ్మతుల అనంతరం తిరిగి గురువారం తెల్లవారు జామున పునరుద్ధరించారు. సంస్థలో 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగో యూనిట్‌లో బ్రాయిలర్‌లో అమర్చిన ట్యూబుకు రంధ్రం ఏర్పడడంతో బుధవారం తెల్లవారు జామున విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం కలిగింది. సమస్యను గుర్తించిన సాంకేతిక నిపుణులు రంగంలోకి దిగి యూనిట్‌లో ఏర్పడిన రిపేర్లను త్వరితగతిన పూర్తి చేసి గురువారం తెల్లవారుజామున 3.55 గంటలకు నాల్గో యూనిట్‌లో విద్యుదుత్పత్తిని పునరుద్ధరించారు. ప్రస్తుతం సంస్థలో నాలుగు యూనిట్లు యథావిధిగా పనిచేస్తున్నాయని ఎన్టీపీసీ అధికారులు తెలిపారు.

ప్రేమ పేరుతో మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

అనకాపల్లి : తనను ప్రేమ పేరుతో మోసం చేసిన వ్యక్తిపై పట్టణంలో శారదాకాలనీకి చెందిన మహిళ పట్టణ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేసింది. సీఐ జి.శంకరరావు తెలిపిన వివరాలివి. మునగపాక మండలం, చూచుకొండ గణపర్తి గ్రామానికి చెందిన మారిశెట్టి శ్యామ్‌కుమార్ తనను ప్రేమిస్తున్నానని నాలుగేళ్లుగా శారీరక సంబంధం పెట్టుకుని, ఆనక ముఖం చాటేసినట్టు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

శిల్పారామం మే నెల ఆదాయం రూ.5.83 లక్షలు

పీఎం పాలెం : మధురవాడ పరిసర ప్రాంతాల ప్రజలు సేద తీరేందుకు ప్రధాన వినోద, విహార కేంద్రంగా ఉన్న శిల్పారామం సందర్శకులను విశేషంగా ఆకర్శిస్తోంది. అంతే స్థాయిలో ఆదాయమూ సమకూర్చుకుంటోంది. నిర్వహణకు అవసరమైన ఆదాయం లభించని దుస్థితి నుంచి అనతి కాలంలోనే తేరుకుంది. రాష్ట్రంలోనే అధిక ఆదాయం సంపాదించే శిల్పారామంగా గుర్తింపు దక్కించుకుంది. గత రెండు సంవత్సరాలుగా సందర్శకుల తాకిడి రోజురోజుకూ రెట్టింపు అవుతోంది. గత సంవత్సరం మే నెల ఆదాయం రూ.3.53 లక్షలు కాగా... ఈ ఏడాది మే నెలలో రూ.5.83 లక్షల మేర ఆదాయం వచ్చిందని స్థానిక పరిపాలన అధికారి టి.విశ్వనాథ రెడ్డి తెలిపారు. మహిళలు, పిల్లల కోసం మరిన్ని హంగులతో శిల్పారామాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామని ఆయన తెలిపారు.

అప్పన్నకు శాస్త్రోక్తంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన సేవ ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టింపజేసి 108 స్వర్ణ సంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. సింహాద్రి అప్పన్న స్వామికి గురువారం 9.30 గంటల నుంచి నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణ మండపంలో వేదికపై ఉంచి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.


నిత్య కల్యాణంలో జీలకర్రబెల్లం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

లలిత పీఠంలో ప్రత్యంగిరా హోమం

సీతంపేట (విశాఖ): స్థానిక లలితపీఠంలో అమావాస్య సందర్భంగా గురువారం శ్రీప్రత్యంగిరా భద్రకాళి హోమం నిర్వహించారు. కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ స్వామి అనుగ్రహంతో పండితుల వేదమంత్రాల మధ్య హోమం శాస్త్రోక్తంగా జరిపారు. పరిసర ప్రాంత భక్తులు పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా పీఠం విస్తరణాధికారి మన్నవ కృష్ణసేన్ మాట్లాడుతూ భక్తుల కోరిక మేరకు లలితపీఠంలో ప్రతీ నెల అమావాస్య రోజున ప్రత్యంగిరా భద్రకాళి హోమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శత్రు నాశనం, ఆర్థిక ఇబ్బందులు తొలగేందుకు, కోర్టు కేసుల్లో విజయం, ఉద్యోగ అభివృద్ధి విషయంలో శుభ ఫలితాల కోసం ఆది పరాశక్తి ప్రత్యంగిరాదేవి అనుగ్రహం పొందేందుకు హోమం నిర్వహించినట్లు తెలిపారు. హోమంలో పాల్గొన్న వారికి సర్వదుష్ట గ్రహ బాధలు, శత్రు ప్రయోగ బాధలు, ఆర్థిక, అనారోగ్య, కుటుంబ బాధలు తొలగిపోయి, కోరికలు తీరుతాయన్నారు. అలాగే ఉదయం పీఠంలో శనీశ్వరుని జయంతి సందర్భంగా శనీశ్వరునికి తైలాభిషేకం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.


లలితపీఠంలో ప్రత్యంగిరా భద్రకాళి హోమంలో పాల్గొన్న భక్తులు

మహిళపై దాడి కేసులో ఒకరికి జైలు

సబ్బవరం: మహిళపై దాడి చేసిన కేసులో మండలంలోని పైడివాడ అగ్రహారానికి చెందిన ఓ వ్యక్తికి అనకాపల్లి కోర్టు రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.4 వేలు జరిమానా విధించినట్టు సబ్బవరం సీఐ పిన్నింటి రమణ గురువారం తెలిపారు. గ్రామానికి చెందిన పెచ్చేటి దుర్గారావు, గుండాల సంతోషి పక్కపక్క ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో సంతోషి తమ ఇంటి వద్ద గతంలో రిగ్గు బోరు తీయిస్తుండగా బోరు నుంచి వస్తున్న బురుద దుర్గారావు ఇంటిపై పడింది. దీంతో వివాదం చెలరేగింది. పెచ్చేటి దుర్గారావు.. సిద్ధయ్య భార్య సంతోషిని రాయితో తలపై బలంగా కొట్టడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. 2022 మార్చి 12న సబ్బవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. అనకాపల్లిలోని 12వ ఏఎంఎం కోర్టు 324 ఐపీసీ సెక్షన్ ప్రకారం ఒక సంవత్సరం జైలు శిక్ష, రూ.2 వేలు జరిమానాతో పాటు 509 ఐపీసీ సెక్షన్ కింద అదనంగా మరో సంవత్సరం జైలు శిక్ష, రూ.2 వేలు జరిమానా విధించినట్టు సీఐ తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


పర్యావరణాన్ని కాపాడాలని ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

సబ్బవరం: భావితరాల భవిష్యత్తుతో పాటు వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించేందుకు పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతగా కృషి చేయాలని సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో విద్యార్థులు మొక్కలు నాటారు. ప్లకార్డులను ప్రదర్శిస్తూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగిస్తున్న ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించాలని పిలుపునిచ్చారు. దీనిపై ప్రతి విద్యార్థి తమ గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వారంతా విరివిగా మొక్కలు నాటేలా చైతన్యం తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వృక్షశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ టీఎంఏ నివేదిత, వైస్ ప్రిన్సిపాల్ బి.శంకర్, సిబ్బంది డాక్టర్ ఎస్.సత్యనారాయణ, ఎం.వి. రామకృష్ణ, బి.లక్ష్మి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎల్.గణేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి

- 9 మందికి తీవ్ర గాయాలు
- ఎంపీపీ సాయంతో పీహెచ్‌సీకి తరలింపు


తేనెటీగల దాడిలో గాయపడ్డ బాధితులు

నాతవరం : ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలపై తేనెటీగలు దాడి చేసి 9 మందిని తీవ్రంగా గాయపరిచాయి. మండలంలో సరుగుడు గ్రామంలో గురువారం ఉదయం ఉపాధి కూలీలు, రైతులు వ్యవసాయ భూమిలో ట్రెంచ్‌లు ఏర్పాటు పనులు చేస్తున్నారు. ఆ సమయంలో అదే ప్రాంతంలో చెట్టుకు పట్టిన తేనెపట్టు చెలరేగి తేనె టీగలు పనులు చేస్తున్న కూలీలను గాయపరిచాయి. తీవ్రంగా గాయపడిన బూడి లక్ష్మణరావు, జయతి లక్ష్మి, జయితి కుమారి, మద్దెల నాగమణి, చిట్టుమూరి చింతల్లి, మద్దెల రాము, మద్దెల ఆనందరావు, పెయ్యల విజయ్, ఎస్. లక్ష్మణమూర్తిలను ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి సంఘటన స్థలానికి చేరుకోని వీరిని నాతవరం పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ వైద్యాధికారి ప్రసన్న వైద్య సేవలు అందించి ఇంటికి పంపించారు. వారిలో బూడి లక్ష్మణరావు, జయితి విజయ్‌లను తేనెటీగలు తీవ్రంగా గాయపరచడంతో మెరుగైన వైద్యం అందించి వైద్యాధికారి ప్రసన్న పలు జాగ్రత్తలు సూచించారు.

బీసీజీ వ్యాక్సినేషన్ తీరు పరిశీలన


తనిఖీ చేస్తున్న రాష్ట్ర టీబీ సంయుక్త సంచాలకుడు టి.రమేష్


ఏయూ క్యాంపస్: రాష్ట్ర ప్రభుత్వ టీబీ సంయుక్త సంచాలకుడు డాక్టర్ టి.రమేష్ గురువారం నగరంలో ఆకస్మిక తనిఖీలు చేశారు. జిల్లాలో అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ జరుగుతున్న తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. విద్యానగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో శ్రామిక వీధి సచివాలయం, కాగితాల వారి వీధి సచివాలయంలో వ్యాక్సిన్ కూలర్, ఐఎల్ఆర్‌ను పరీక్షించారు. ఆయన సమక్షంలో పలువురు మధుమేహ, టీబీ బాధితులకు వ్యాక్సిన్ వేశారు. అనంతరం లాసన్స్ బే కాలనీలో పర్యటించి ఆరోగ్య సిబ్బంది వ్యాక్సిన్ వేసే విధానం, తదితర అంశాలను గమనించారు. అర్హులందరికీ వ్యాక్సిన్ వేయాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. అనంతరం ఎంవీపీ కాలనీ సందర్శించి వ్యాక్సిన్ పంపిణీ జరుగుతున్న విధానాన్ని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దేరు వంతెనపై ఆటో బోల్తా ... తప్పిన ప్రమాదం

బుచ్చెయ్యపేట : వడ్డాది వంతెనపై ఇనుము లోడుతో వెళ్తున్న ఆటో బోల్తా పడింది. గురువారం వడ్డాది జంక్షన్ నుంచి బంగారుమెట్ట వైపు ఇనుము లోడుతో వెళ్తున్న తొట్టి ఆటో పెద్దేరు వంతెన వద్ద గోతులో పడి బోల్తా పడింది. ఇరుకుగా ఉన్న వంతెన వద్ద రెప్పపాటులో స్కూటరిస్టు ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. ఆటో బోల్తా పడుతున్నట్టు గమనించిన స్కూటరిస్టు రెప్పపాటులో తప్పించుకోగా ఆటో డ్రైవర్ ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. టన్నుల బరువున్న ఇనుము గాని వంతెనకు ఇరువైపులా ఉన్న డివైడర్లు గాని తగిలి ఉంటే స్కూటరిస్టుకు, డ్రైవర్‌కు ప్రమాదం జరిగేదని స్థానికులు తెలిపారు. వంతెన వద్ద ఉన్న గోతులను పూడ్చాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.


వంతెన వద్ద బోల్తా పడిన ఇనుము లోడుతో వెళ్తున్న ఆటో

బైక్ ప్రమాదంలో యువకుడికి గాయాలు


గాయపడిన గంగరాజు

మాకవరపాలెం : రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. మండలంలోని రామన్నపాలెం గ్రామానికి చెందిన కూండ్రపు గంగరాజు (35) గురువారం మాకవరపాలెం నుంచి మోటార్ సైకిల్‌పై స్వగ్రామం వెళుతున్నాడు. ఈ నేపథ్యంలో స్థానిక ప్రాథమిక పాఠశాల ఎదురుగా డివైడర్‌ను ప్రమాదవశాత్తూ ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతడిని చికిత్స కోసం నర్సీపట్నం తరలించారు.

రక్షక్ వాహనాన్ని ఢీ కొట్టిన ట్యాంకర్


నుజ్జయిన రక్షక్ వాహనం వెనుకభాగం


క్రైం ఎస్ఐ మన్మథరావు కంటిపై గాయం

అక్కిరెడ్డిపాలెం: నైట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న రక్షక్ వాహనాన్ని ట్యాంకర్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో క్రైం ఎస్ఐ ఎ.మన్మథరావుకు స్వల్ప గాయాలయ్యాయి. డ్రైవర్‌కు ఎటువంటి ప్రమాదం జరగలేదు. గాజువాక ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలివీ.. బుధవారం అర్ధరాత్రి సమయంలో గాజువాక క్రైం ఎస్ఐ ఎ.మన్మథరావు నైట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. షీలానగర్ పెట్రోల్ బంక్ దాటి అక్కిరెడ్డిపాలెం వైపు వస్తున్న సమయంలో లారీ ట్రాన్స్‌పోర్టు కార్యాలయాల సమీపంలో రక్షక్ వాహనాన్ని వెనుకనే వస్తున్న ట్యాంకర్ లారీ బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రక్షక్ వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనున్న డివైడర్ పైకి దూసుకుపోయింది. వాహనం వెనుక భాగం నుజ్జయ్యింది. వాహనంలో ముందు కూర్చొని ఉన్న ఎస్ఐ మన్మథరావు కంటి పైభాగంలో స్వల్ప గాయమైంది. డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డారు. వెంటనే లారీ స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఉపాధ్యాయురాలి ఇంట్లో చోరీ


చోరీ జరిగిన తీరు పరిశీలిస్తున్న పోలీసులు

యలమంచిలి రూరల్ : పట్టణంలోని రంగావారి వీధిలో ఉపాధ్యాయురాలి ఇంట్లో బుధవారం రాత్రి చోరీ జరిగింది. ఇక్కడ నివాసముంటున్న ప్రభుత్వ ఉపాధ్యాయురాలు ఆచళ్ల హైమావతి గత నెల 24న తీర్థయాత్రలకు వెళ్లారు. గురువారం తిరిగి వచ్చేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూస్తే సుమారు కేజీన్నర వెండి వస్తువులు చోరీకి గురైనట్టు గుర్తించారు. పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ కె.సావినాయుడు చోరీ జరిగిన ఇంటికి వెళ్లి పరిశీలించారు. క్లూస్ టీం వచ్చి ఘటనా స్థలంలో ఆధారాలు సేకరించింది.ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ విలేకరులకు తెలిపారు.

ఆరు కిలోల గంజాయి స్వాధీనం

గోపాలపట్నం: బెంగళూరుకు గంజాయి తరలించేందుకు యత్నిస్తున్న వ్యక్తులను టాస్క్‌ఫోర్స్, ఎయిర్‌పోర్టు పోలీసులు అరెస్ట్ చేశారు. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలివీ.. కర్నాటకకు చెందిన కిరణ్‌కుమార్ చెన్నప్ప, శివరాజ్ గజేంద్ర ఒడిశా అరకు సమీపంలో శ్యామ్ సుందర్ కిముండి వద్ద ఆరు కిలోల గంజాయిని రూ.10 వేలకు కొనుగోలు చేశారు. గంజాయితో బెంగళూరు వెళ్లేందుకు ప్రయత్నించగా.. పక్కా సమాచారంతో ఎన్ఏడీ వద్ద టాస్క్‌ఫోర్స్, ఎయిర్‌పోర్టు పోలీసులు వారిని పట్టుకున్నారు. కిరణ్‌కుమార్ చెన్నప్ప, శివరాజ్ గజేంద్ర, శ్యామ్ సుందర్ కిముండిని అరెస్ట్ చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సీఐ చక్రధరరావు నేతృత్వంలో కేసు దర్యాప్తు జరుగుతోంది.

క్లుప్తంగా

నూకాంబికకు చీరల అలంకరణ



చీరలతో భక్తులకు దర్శనం ఇస్తున్న తాకాశివీధి నూకాంబిక అమ్మవారు

అనకాపల్లి: స్థానిక తాకాశివీధి నూకాంబిక అమ్మవారిని అమావాస్య పురస్కరించుకుని భక్తులు సమర్పించిన 101 చీరలతో గురువారం అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వీధి పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

9న ఉచిత వైద్య శిబిరం

అనకాపల్లి: వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 9న స్థానిక గీతా ఆస్పత్రిలో ఉచిత ఎముకల పరీక్షలు నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు భీశెట్టి రామకృష్ణ, యల్లపు సాంబశివరావులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 45 ఏళ్లు పైబడి, దీర్ఘకాలిక నడుం నొప్పి, కీళ్ల నొప్పులు, ఎముకలు తరుచుగా విరుగుట, మెనోపాజ్ వయసు దాటిన మహిళలు తదితర సమస్యలున్న వారి కోసం ఈ శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

అనకాపల్లి: తుమ్మపాల, ఏకే పాలెం సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆ శాఖ ఈఈ ఎస్.రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తుమ్మపాల 33/11కేవీ(ఏకే పాలెం సబ్‌స్టేషన్, తుమ్మపాల వాటర్ వర్క్స్) పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు విద్యుత్‌శాఖ ఉద్యోగులకు సహకరించాల్సిందిగా కోరారు.

ఎన్ఎంఎంఎస్‌లో సత్తా చాటిన విద్యార్థులు

కోటవురట్ల: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో సత్తా చాటిన పలువురు విద్యార్థులు స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. రాజుపేట ఎంపీయూపీ స్కూల్‌కు చెందిన విద్యార్థులు దుబాసి యశస్విని, మళ్ల చర్మిళ, సూరిశెట్టి రష్మిత, తీడ వెంకట రాజ్‌కుమార్, ఎత్తుల శివదుర్గ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. దాంతో ప్రధానోపాధ్యాయుడు షేక్ ఖాలీషా, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. మిగతా విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకుని ఉత్తమ ఫలితాల సాధనకు పట్టుదలగా కృషి చేయాలన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 123 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,380	5,050
రెండో రకం	3,980	4,500
మూడోరకం	3,500	4,060

అనకాపల్లి సినిమాలు

గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి	:రాజా
మనమే	:సత్యనారాయణ స్క్రీన్-1
గం గం గణేశా	:సత్యనారాయణ స్క్రీన్-2
బ్యాడ్ బాయ్స్(రైడ్ ఆర్ డై)	:షిర్డిసాయి
లవ్ మౌళి	:పర్తిసాయి
సత్యభామ	:వెంకటేశ్వర
వెపన్	:శ్రీసత్య
భజే వాయు వేగం	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 32 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10 యూనిట్లు, బీ పాజిటివ్-15 యూనిట్లు, ఓ పాజిటివ్-6 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్(9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 355 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 291 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

రైతన్నకు రక్ష.. భూసార పరీక్ష

వ్యవసాయ క్షేత్రాల్లోని నత్రజని, పొటాషియం, భాస్వరం, పీహెచ్ తదితర పోషక పదార్థాలను తీసుకుని పంట చేలు ఎదుగుతాయి. దీంతో క్రమేపీ భూసారం తగ్గుతుంది. ఏయే పోషకాలు తగ్గాయో తెలుసుకుని, వాటిని కొత్త పంట సాగుకు ముందే భూమికి అందించాలి. అలా చేస్తేనే పంట దిగుబడి బాగుంటుంది. అందుకు మట్టి నమూనా పరీక్షలు కీలకం. దీని ద్వారా నేలలో తగ్గిన పోషకాలను తెలుసుకోవచ్చు. ఆ మేరకు తగు పోషక పదార్థాలను ఎరువుల రూపంలో అందిస్తే సరిపోతుంది.

- పంటపొలాల్లో భూసార పరీక్షలు తప్పనిసరి
- పచ్చిరొట్ట విత్తనాల సాగుతో భూసారం
- రసాయన ఎరువులు, పురుగు మందులకు చెక్
- పెట్టుబడి తగ్గి, పెరగనున్న దిగుబడి



పంట పొలంలో భూసార పరీక్షలు చేస్తున్న వ్యవసాయ అధికారులు(ఫైల్)

తుమ్మపాల: రసాయన ఎరువుల వాడకం పెరిగి, వ్యవసాయ క్షేత్రాలు నిస్సారమై పంట దిగుబడి తగ్గుతోంది. పూర్వం వేసవిలో భూమిని దుక్కి చేసి, పెంట గెత్తం, చెరువు మట్టిని వేసి సారవంతం చేసేవారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు వచ్చేవి. ఆరోగ్యకరమైన పంటలు చేతికి అందేవి. కాలం మారింది. పంట పొలాల్లో రోజురోజుకూ భూసారం తగ్గుతోంది. ఏ పంట సాగు చేసినా పెట్టుబడే మిగులుతోంది. ఈ నేపథ్యంలో భూసార పరీక్షలకు ప్రాధాన్యం పెరిగింది. మట్టి పరీక్షలు నిర్వహించి పోషక లోపాలు నివారించాలని, పశువుల పెంట, పచ్చిరొట్ట ఎరువులతో భూమిని సారవంతం చేయాలని వ్యవసాయ అధికారులు రైతులకు సూచిస్తున్నారు. మట్టి పరీక్షల ప్రాధాన్యంపై అవగాహన కల్పిస్తున్నారు.

మండలంలో సాగు పరిస్థితి

మండలంలో 2,150 హెక్టార్ల వరకు వరి, 128 హెక్టార్లలో చెరకు, దాదాపు 100 హెక్టార్లలో ఇతర పంటలు సాగు చేస్తున్నారు. పొలాల్లో ఎరువులు ఎక్కువ మోతాదులో వినియోగించడంతో భూమిలో పోషక విలువల్లో అసమతుల్యత ఏర్పడి, నేల నిస్సారంగా మారుతోంది. కాంప్లెక్స్ ఎరువుల వినియోగంతో భూమిలో సూక్ష్మ, స్థూల పోషకాల్లో వ్యత్యాసాలతో చీడపీడలు పెరిగి, దిగుబడి పడిపోతోంది. గత కొన్నేళ్లుగా పలు గ్రామాల్లో భూసారం తగ్గుతున్నట్లు వ్యవసాయ గణాంకాలు చెబుతున్నాయి. క్రమం తప్పకుండా భూసార పరీక్షలు చేయించాలని అధికారులు సూచిస్తున్నారు. పరీక్షల నివేదిక ఆధారంగా పంటలు సాగుచేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని చెబుతున్నారు. ఈ పరీక్షలు ఖరీఫ్ సాగు ప్రారంభం నాటికి పూర్తి చేసేందుకు వ్యవసాయ శాఖ సిబ్బంది ప్రయత్నిస్తున్నారు.

భూసార పరీక్షల తీరు

సాధారణ పొలంలో అయితే ఆరు అంగుళాల లోతు, చెరకు పొలాల్లో అయితే ఎనిమిది అంగుళాల లోతులో ×వి॰ఆకారంలో పారతో కట్ చేసి, మట్టి నమూనా సేకరించాలి. ఇలా ప్రతి ఐదెకరాలకు ఒక మట్టి నమూనాను సేకరిస్తారు. మట్టి నమూనాతో పాటు, రైతు పేరు, సర్వే నంబరు, విస్తీర్ణం, ముందు వేసిన పంట, వేయబోయే పంట, వినియోగించిన ఎరువుల వివరాలను పొందుపరుస్తారు. వీటిని ఇంటిగ్రేటెడ్ ల్యాబ్(భూసార పరీక్ష కేంద్రం)కు తరలించి, పరీక్షిస్తారు. అనంతరం సేంద్రియ కర్బనం, ఎలక్ట్రికల్ కండక్టివిటీ(ఈసీ), ఉదజని సూచిక(పీహెచ్), నత్రజని, భాస్వరం, పొటాష్, సూక్ష్మ మూలకాలు, ధాతు లోపాలు తదితర వివరాలను కార్డుపై నమోదు చేసి, రైతుకు అందిస్తారు. దీంతో కార్డులో పేర్కొన్న ధాతువుల్ని పొలంలో వేసుకుంటే భూమి సారవంతమై, సిరులు పండుతాయి.

భూసార పరీక్షల లాభాలు

- భూమిలో ఎటువంటి లోపాలున్నాయో తెలుస్తాయి.
- ఆ లోపాల నివారణకు సరిపడా ఎరువుల గురించి తెలుస్తుంది.
- అనవసర ఎరువుల వినియోగం తగ్గుతుంది.
- తెగుళ్లు, చీడపీడల నివారణ సులభతరమవుతుంది.
- వ్యవసాయ పెట్టుబడి ఖర్చులు భారీగా తగ్గుతాయి.

పచ్చిరొట్టతో భూసారం



వ్యవసాయంలో రసాయనాల వాడకం తగ్గించేందుకు భూసార పరీక్షలు చాలా అవసరం. రసాయనిక ఎరువుల వాడకంతో ఖర్చు పెరిగి, వ్యవసాయం భారంగా మారింది. ఈ పరిస్థితి అధిగమించేందుకు పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, పిల్లి పెసర తదితర విత్తనాలు సాగు చేసి, ఏపుగా పెరిగాక దుక్కిలో కలియ దున్నుకోవాలి. దీంతో భూసారం పెరుగుతుంది. ఈ విత్తనాలను రాయితీపై అందిస్తున్నాం. రైతులు సద్వినియోగం చేసుకుని, భూసారం పెంచుకోవాలి.

– పి.బి.రంగాచారి, మండల వ్యవసాయ అధికారి, అనకాపల్లి

ముగిసిన వేసవి శిక్షణ



చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



దిమిలి గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ ముగింపు కార్యక్రమంలో విద్యార్థులు

రాంబిల్లి : దిమిలి శాఖా గ్రంథాలయంలో గురువారం వేసవి విజ్ఞాన శిక్షణ కార్యక్రమం ముగిసింది. వేసవి సెలవుల్లో విద్యార్థులకు ఉపయోగపడేలా ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు లైబ్రేరియన్ ఎస్. శకుంతల అన్నారు. నీతికథలు, పుస్తకపఠనం, కోలాటాలు, పలు అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. కాగా వేసవి విజ్ఞాన శిక్షణలో భాగంగా పలు అంశాలతో పాటు పలు ఆటల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ఇంగ్లిష్ భాషపై ప్రావీణ్యం సాధించాలి

అచ్యుతాపురం : ఇంగ్లిష్ భాషపై ప్రావీణ్యం సాధించాలని రిసోర్స్ పర్సన్ కె.బాబూరావు అన్నారు. అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఇంగ్లిష్ అంశంపై పలు సూచనలు ఇచ్చారు. ఇంగ్లిష్‌పై పిల్లలకు ఉన్న అవగాహనను తెలుసుకొన్నారు. గ్రంథాలయాధికారి కోటేశ్వరరావు పాల్గొన్నారు.



ఇంగ్లిష్ భాషపై అవగాహన కల్పిస్తున్న రిసోర్స్ పర్సన్ బాబూరావు

చిత్రలేఖనం ద్వారా మానసిక వికాసం

మునగపాక : చిత్రలేఖనం ద్వారా మానసిక వికాసం పెరుగుతుందని సీఆర్పీ బొడ్డేడ అచ్చుతకృష్ణ అన్నారు. విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా గురువారం స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో మేధాశక్తిని పెంచేందుకు ఇటువంటి శిక్షణ తరగతులు దోహదపడతాయన్నారు. అలాగే ఏకాగ్రతతో చదువుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. గ్రంథాలయాధికారి ఎల్.వి. రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

రారెత్తించిన టమాటా

కశింకోట: స్థానిక వారపు సంతలో గురువారం టమాటా ధర భారీగా పెరిగింది. గత వారం కిలో రూ.40 ఉన్న టమాటా, ఈ వారం రూ.60కి పెరిగింది. ఉల్లిపాయ రూ.25 నుంచి రూ.30, బంగాళాదుంప రూ.30 నుంచి రూ.40కి పెరిగాయి. బీట్రూట్, క్యారెట్, బెండకాయ, వంకాయ, దొండకాయ రూ.40, బీరకాయ రూ.60కి విక్రయాలు సాగాయి.

సరదా ఆటలు ఆడుదాం



ధ్యానం చేస్తున్న పిల్లలు

పెందుర్తి: పెందుర్తి శాఖ గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గురువారం చిన్నారులకు కథలు చదవడం, రాయడం, చెప్పడం నేర్పించారు. అనంతరం ధ్యానం చేయించారు. సరదా ఆటలు ఆడుదాం కార్యక్రమంలో భాగంగా పాసింగ్ బాల్ గేమ్ ఆడించారు. ధ్యానంలో మెళకువలు నేర్పారు. దేశ భక్తి గీతాలపై పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయాధికారి బి.సూర్యకళ, విశ్రాంత ఉపాధ్యాయుడు ధనుంజయ్, గ్రంథాలయాభివృద్ధి కమిటీ ప్రతినిధులు పెతకంశెట్టి భూలోకరావు, ఆడారి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తలుపులమ్మతల్లి పండగ

కోటవురట్ల : పాత తంగేడు గ్రామంలో తలుపులమ్మతల్లి పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ శివారున ఉన్న అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించి పూజలు చేశారు. సమీప గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. స్వచ్ఛంద సంస్థలు, యువకులు ఆలయం వద్ద సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రసాద వితరణతో పాటు మజ్జిగ పంపిణీ చేశారు. మొక్కులు చెల్లించుకుని తలనీలాలు సమర్పించుకున్నారు.



తలుపులమ్మ తల్లికి పూజలు చేస్తున్న మహిళలు

గంగాలమ్మ తల్లి గుడి నిర్మాణానికి విరాళం



గంగాలమ్మతల్లి గుడికి విరాళం అందిస్తున్న జనసేన మండల పార్టీ అధ్యక్షుడు పరశురామ్

మునగపాక : మూలపేట గంగాలమ్మ తల్లి గుడి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పలువురు దాతలు ముందుకొచ్చి విరాళాలు అందజేస్తున్నారు. దీనిలో భాగంగా గురువారం రాత్రి మునగపాక మండల జనసేన అధ్యక్షుడు, మునగపాక ఎంపీటీసీ మాజీ సభ్యుడు టెక్కలి పరశురామ్ తన కుటుంబ సభ్యుల పేరిట రూ.20,116 నగదును కమిటీ సభ్యులకు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, గాంధీతో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఖాజీపాలెంలో ఉపాధి పనులు ప్రారంభించాలి

అచ్యుతాపురం : మండలంలోని ఖాజీపాలెంలో ఉపాధి హామీ పనులు నిలిపివేయడం దారుణమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఆయన ఖాజీపాలెంలో ఉపాధి హామీ కూలీలను కలిసి మాట్లాడారు. గ్రామంలో అర్ధాంతరంగా నిలిపివేయడం అన్యాయం అన్నారు. తక్షణమే గ్రామంలో జాబ్ కార్డుదారులందరికీ పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ ప్రతినిధులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.



ఖాజీపాలెంలో ఉపాధి హామీ కూలీలతో రాము

భక్తిశ్రద్ధలతో నేస్తాలమ్మ పండగ

ఎస్.రాయవరం : వమ్మవరం గ్రామంలో శ్రీ నేస్తాలమ్మతల్లి పండగ గురువారం ఘనంగా నిర్వహించారు. అన్నదాతలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించే ఈ పండగ సందర్భంగా అమ్మవారికి వేకువ జామునుంచి దర్శించుకునేందుకు పోటీ పడ్డారు. మహిళలు పసుపు కుంకుమలు సమర్పించగా రైతులు వ్యవసాయ పనులు సక్రమంగా జరగాలని మొక్కుకున్నారు. తొలకరి ముందుగా ఈ అమ్మవారి జాతర నిర్వహించి వ్యవసాయ పనులు ప్రారంభిస్తే శుభ సూచికమని వారి నమ్మకం.



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ఆహ్వానం



ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన సముదాయం

చోడవరం రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులలో చేరడానికి ఆసక్తి గల విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ టి.రాధాకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి మొదటి సంవత్సరం బీఏ, బీఎస్సీ, బీకాం కోర్సులలో చేరగోరే విద్యార్థులు ఆన్‌లైన్లో దరఖాస్తులను చేసుకోవాలన్నారు. కళాశాలలో బీఏ ఎకనామిక్స్ ఆనర్స్ కోర్సులో 60 సీట్లు, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్‌లో 60 సీట్లు, బీఎస్సీ జువాలజీలో ఆనర్స్ కోర్సు 40 సీట్లు, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ కోర్సులో 40 సీట్లు, బీఎస్సీ ఫిజిక్స్ ఆనర్స్ కోర్సులో 40 సీట్లు అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. ఈ నెల 26వ తేదీ నుంచి ఓఏఎండీసీ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులైన ఫ్యాకల్టీ, అన్ని సదుపాయాలు ఉన్నాయని, చక్కని విద్యా బోధన అందిస్తున్న ప్రభుత్వ కళాశాలలో చేరాల్సిందిగా కోరారు. డిగ్రీ విద్యార్థులకు ఈ నెల 14 నుంచి నాల్గో సెమిస్టర్ పరీక్షలు, మధ్యాహ్న సమయంలో సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఎండ తీవ్రతకు వెలవెలబోయిన సంత



వేసవి ఎండతో కొనుగోలుదారులు లేక బోసిపోయిన వారపు సంత

కశింకోట: స్థానిక వారపు సంత వేసవి తాపానికి గురువారం వెలవెలబోయింది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు ఎండ తీవ్రంగా ఉండటంతో కొనుగోలుదారుల తాకిడి తగ్గింది. దీంతో కూరగాయలు, పండ్లు, మసాల దినుసులు, వస్త్రాలు తదితర వస్తువులు విక్రయించే వ్యాపారులు కూడా అధిక వేడిని భరించలేక సమీపంలోని ఇళ్లు, దుకాణాల నీడన చేరారు. దీంతో దుకాణాలు వెలవెలబోయాయి. మధ్యాహ్నం 3.30 నుంచి ఎండ తీవ్రత తగ్గడంతో యథావిధిగా అమ్మకాలు సాగాయి.

చిరస్మరణీయుడు చంద్ర

అనకాపల్లి: స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ జాతీయ నేత చంద్ర రాజేశ్వరరావు 110వ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్ర చిత్రపటానికి పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కృష్ణా జిల్లాకు చెందిన జమీందారీ కుటుంబంలో జన్మించిన చంద్ర, తన వందల ఎకరాల భూముల్ని పేదలకు ఉచితంగా పంచి పెట్టిన త్యాగశీలి అని కొనియాడారు. పేదల పక్షాన నిలిచి, జమీందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమాలు నిర్వహించారన్నారు. పేదల పక్షాన పోరాటం చేయడమే సీపీఐ కర్తవ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు, నాయకులు సత్యనారాయణ, సత్తిబాబు, పోతురాజు, రమణ, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



చంద్ర రాజేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులి అర్పిస్తున్న రాజాన దొరబాబు

విద్యార్థుల్లో నిర్మాణాత్మక అభ్యసనకు కృషి

కశింకోట: బాల బాలికల్లో నిర్మాణాత్మక అభ్యసన సామర్థ్యాలను పెంపొందించడానికి కృషి చేయాలని జిల్లా ఏఎంవో ఎం.ఎం.పట్నాయక్ కోరారు. కశింకోటలోని డీపీఎన్ జెడ్పీ హైస్కూల్లో డీఆర్‌పీలకు రెండు రోజులపాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రీ ప్రైమరీ, 1, 2 తరగతుల బాలలు పరిపూర్ణ విద్యా వృద్ధి సాధించేందుకు నూతన బోధనా పద్ధతులను, మూల్యాంకన విధానాలను ఉపాధ్యాయులు అలవర్చుకుని, పాఠశాలల్లో అమలు పరచాలన్నారు. ఈ శిక్షణను సద్వినియోగపర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎంఆర్‌వీ అప్పారావు, డైట్ లెక్చరర్ మాధవి, ఎంఈవోలు కె.చిట్టిబాబు, కేఎస్ఎన్ మూర్తి, డి.వేణుగోపాలరావు(మునగపాక), రిసోర్స్ పర్సన్లు కె.ఉమామహేశ్వరరావు, కె.నానాజీ, సీహెచ్ఎస్ దొర, కేవీఎల్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



డీఆర్‌పీల శిక్షణ కార్యక్రమంలో మాట్లాతున్న జిల్లా ఏఎంవో పట్నాయక్

గ్రామాల్లో సమస్యలపై దృష్టి సారించాలి

పాయకరావుపేట : గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని ఈవోఆర్‌డీ చంద్రశేఖర్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులతో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. గతంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ఓ.టి.ఎస్. నగదు చెల్లింపు వివరాలు ప్రభుత్వానికి పంపించాలన్నారు.

వర్షాకాలం ప్రారంభం అయిన కారణంగా పారిశుధ్య లోపం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీరు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా జాగ్రత్త వహించాలన్నారు. గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు చురుగ్గా జరిగేటట్టు చర్యలు తీసుకోవాలన్నారు.



గ్రామ కార్యదర్శులతో మాట్లాడుతున్న ఈవోఆర్‌డీ చంద్రశేఖర్

పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోండి

కోటవురట్ల : ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని పారిశుధ్య మెరుగుకు చర్యలు తీసుకోవాలని కార్యదర్శులను ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ వర్షాలకు పల్లెల్లో పారిశుధ్యం లోపించకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా రక్షిత మంచినీటి పథకాల్లో క్లోరినేషన్, క్లీనింగ్ ప్రక్రియను నిర్వహించాలన్నారు. ఓటీఎస్ పెండింగ్ చలానాలపై దృష్టి పెట్టి పూర్తి చేసేందుకు కృషి చేయాలని సూచించారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు.



కార్యదర్శులకు సూచనలు ఇస్తున్న ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు

పింఛన్ సొమ్ము కోసం తప్పని కష్టాలు

దేవరాపల్లి: ప్రతి నెలా వలంటీర్ ద్వారా అందించిన అవ్వాతాతల పింఛన్ సొమ్మును ఈ నెల కూడా బ్యాంక్ ఖాతాల్లో జమ చేయడంతో వారంతా నానా అవస్థలు పడుతున్నారు. పింఛన్ సొమ్ము కోసం బ్యాంక్‌ల వద్ద గంటల కొద్దీ నిరీక్షణ చేసి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బీసీ పాయింట్, యూకో బ్యాంక్‌లతోపాటు వివిధ బ్యాంక్‌ల బీసీ పాయింట్‌ల వద్ద అవ్వాతాతలు పడిగాపులు కాశారు. గురువారం ఉదయం 9 గంటల నుంచి సుదూర గ్రామాల నుంచి వృద్ధులు కుటుంబ సభ్యుల సహాయంతో బ్యాంక్‌ల వద్దకు చేరుకున్నారు. బ్యాంక్‌ల వద్ద పడిగాపులు కాయడంతోపాటు రానుపోను 200 రూపాయలు ఆటో చార్జీలకు ముట్ట చెప్పాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో తమకు సూర్యోదయం కాకముందే పింఛన్ సొమ్ము అందించేవారని, ఇప్పుడు ఇలా బ్యాంక్‌లు చుట్టూ తమను తిప్పి ఇబ్బందలకు గురిచేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి గతంలో మాదిరిగా ఇంటి వద్దే పింఛన్ సొమ్ము అందించాలని ముక్తకంఠంతో కోరుతున్నారు.



దేవరాపల్లి ఎస్‌బీఐ బీసీ పాయింట్ వద్ద పింఛన్ సొమ్ము కోసం నిరీక్షిస్తున్న పింఛన్‌దారులు